ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

పీఏసీ ఛైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్‌: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని పీఏసీ ఛైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. మాదాపూర్‌ డివిజన్‌ మాతృశ్రీనగర్‌కు చెందిన వీవీ ఎస్‌ఎస్‌ఆర్‌ రవితేజకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 60 వేలకు సంబంధించిన చెక్కును శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదన్నారు. వైద్య చికిత్సకి సహకారం అందించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.డి.ఇబ్రహీం, రవితేజ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఘనంగా గ్లోబల్‌ ఎన్‌క్రిప్షన్‌ డే

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో శుక్రవారం గ్లోబల్‌ ఎన్‌క్రిప్షన్‌ డే–2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్సెస్‌ (ఎస్‌సీఐఎస్‌) హెచ్‌సీయూ ఇంటర్నెట్‌ సొసైటీ (ఐఎస్‌ఓసీ) హైదరాబాద్‌ చాప్టర్‌ సహకారంలో ఈ గ్లోబల్‌ ఎన్‌క్రిప్షన్‌ డే–2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బీజే రావు మాట్లాడుతూ... డిజిటల్‌ సామాజిక అవగాహనను కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో సహాయపడుతుందన్నారు. గోప్యతా అవసరాలను తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. గణిత శాస్త్రవేత్తలు, భద్రతా నిపుణులు, ఎన్‌క్రిప్షన్‌, క్రిప్టోగ్రఫీ, క్వాంటం కమ్యూనికేషన్‌ల ద్వారా వివిధ భద్రతా అవసరాలను పరిశీలించాలన్నారు. రాబోయే 20–30 సంవత్సరాలకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఐఎస్‌ఓసీ అధ్యక్షుడు కె.మోహన్‌రాయుడు మాట్లాడుతూ... సైబర్‌ సెక్యూరిటీలో అపారమైన వృద్ధి ఉన్నందున సమగ్రతను నిర్ధారించడానికి ఎన్‌క్రిప్షన్‌ల ప్రాముఖ్యతను పెంచామన్నారు. ప్రస్తుతం ఎన్‌క్రిప్షన్‌ ప్రాథమిక హక్కుగా మారాలని ఆయన సూచించారు. ఎస్‌సీఐఎస్‌ డీన్‌ ప్రొఫెసర్‌ అతుల్‌ నేగి, ఈ వెంట్‌ కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ ఎస్‌.రుక్మరేఖ తదితరులు మాట్లాడారు.


ఎన్‌క్రిప్షన్‌డేలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్‌ బీజేరావు తదితరులు

ఫ్లైఓవర్లకు సొబగులు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌కు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ ద్వారా కళాత్మక ఆవిష్కరణ పెయింటింగ్‌లు వేస్తున్నామని చందానగర్‌ ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌కు పెయింటింగ్‌ వేస్తున్న వాటిని సర్కిల్‌–21 ఈఈ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శేరిలింగంపల్లి జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి ఆదేశాల మేరకు చందానగర్‌ సర్కిల్‌–21 పరిధిలోని ఫ్లైఓవర్లను నూతన హంగులతో సరికొత్తగా మార్చడానికి పెయింటింగ్‌లు వేయించడం జరుగుతున్నదన్నారు. ప్రత్యేక నిధులు ద్వారా కళాత్మకమైన రంగులు వేయిస్తున్నామన్నారు.


హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌కు వేసిన పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న సర్కిల్‌–21 ఈఈ రాజు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న కార్యదర్శి రమేశ్‌

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్‌

పటాన్‌చెరు టౌన్‌: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్‌ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌ బాలికల సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్‌ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, ఫోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణం చేపట్టాలి

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని శివశక్తి నగర్‌లోని స్ట్రాం వాటర్‌ డ్రైన్‌ కుంగిపోయి ఉందని, కాలనీలోకి వచ్చే వరద నీటిని నివారించేందుకు తక్షణమే నీటి కాలువ నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్‌ పగుడాల శిరీష అన్నారు. ఈ మేరకు శుక్రవారం జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఆఫీసు ఈస్ట్‌ గేట్‌ నుంచి శ్రీహరినగర్‌ వసుంధర హాస్పిటల్‌ వరకు దెబ్బతిన్న సీసీ రోడ్డుకు నిధులు కేటాయించాలన్నారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షుడు సీహెచ్‌. ప్రభాకర్‌ గౌడ్‌, భాస్కర్‌ రావు, సుశీల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.


జోనల్‌ కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్‌ శిరీష

పార్కు నిర్వహణ అధ్వానం


హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీ పార్కు ఇలా..

- హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీ పార్కులో కొరవడిన ఆహ్లాదం
- జీహెచ్‌ఎంసీ పార్కులోకి స్థానికులు వెళ్లలేని దుస్థితి

శేరిలింగంపల్లి: లక్షలాది రూపాయల ప్రజాధనంతో అభివృద్ధి చేసిన పార్కుల నిర్వహణ గాలికి వదిలేస్తున్నారు. నగరమంతా థీమ్‌ పార్కులు, ఇతర జీహెచ్‌ఎంసీ పార్కులను అభివృద్ధి చేస్తున్న అధికారులు ఉన్న పార్కుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారనడానికి శేరిలింగంపల్లిలోని హుడాట్రేడ్‌ సెంటర్‌ కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కు ఉదాహరణగా చెప్పవచ్చు.


విరిగిపోయిన బెంచీలు

- తమ సమీపానే పార్కు ఉన్నా ప్రజలు సేద తీరే అవకాశం లేనందున స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం అందరూ వాకింగ్‌ చేసే ప్రస్తుత తరుణంలో ఆ తర్వాత కొద్ది సేపు ప్రశాంత, ఆహ్లాద పూరిత వాతావరణంలో గడిపేలా ఉండాల్సిన పార్కు కాస్తా ఇబ్బందులు సృష్టించేదిగా మారిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీన్ని అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని పలువురు కోరుతున్నారు.
- శేరిలింగంపల్లి డివిజన్‌ పరిధి హుడాట్రేడ్‌ సెంటర్‌ కాలనీ నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌ సమీపంలోని పార్కును జీహెచ్‌ఎంసీ లక్షలాది రూపాయలు వ్యయం చేసి అభివృద్ధి చేసింది.
- పార్కు నిర్వహణను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వలన పరిస్థితి అధ్వానంగా మారింది.


వాకింగ్‌ ట్రాక్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పెరిగిన గడ్డి

- కాలనీలో మొత్తం అపార్టుమెంట్‌లే ఉండటంతో సాయంత్రం వేళ కాసేపు సేద తీరే అవకాశం లేకపోయింది ఇక్కడ పరిస్థితిని చూసి ఇంటికే పరిమితం అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.
- పార్కులో ఎటూ చూసినా చెత్త, ఇతర వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. పార్కులో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో తీవ్ర అసౌకర్యాన్ని కల్గిస్తోంది.
- పగలు, రాత్రి అనే తేడాలేకుండా మందు బాబులు ఇక్కడ కూర్చొని మందు సేవిస్తున్నారని, దీంతో మహిళలు పార్కులోకి రావాలంటేనే జంకుతున్నారని పలువురు వాపోతున్నారు.
- పార్కులో ఉన్న గడ్డిని ఎప్పటికప్పుడు కత్తిరించాల్సి ఉన్నా ఆ పనిచేయకపోవడంతో దాని రూపురేకలే మారిపోతున్నాయి.
- పార్కులోని బెంచీలు ధ్వంసం అవడంతో కూర్చునేందుకు సరిపోవడం లేదు.
- పార్కులోని వాకింగ్‌ ట్రాక్‌లో చెత్తాచెదారం, గడ్డి బాగా పెరిగిపోవడంతో వాకింగ్‌ చేసే వారికి ఇబ్బందిగా మారింది.

ఇలా చేస్తే..

పార్కులో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలి
- గ్రీనరీ, పూలు, ఆకర్షణీయమైన మొక్కలుండేలా చూడాలి
- లైటింగ్‌, ఇతరత్రా వసతులు ఏర్పాటు చేయాలి
- చుట్టూ ఉన్న ప్రహరీకి మరమ్మతులు చేసి, రంగులు వేసి, గేటు సరిచేసి, కాపలాదారును నియమించాలి
- స్థలం కొంచమైనా వాకింగ్‌ చేసేలా ఏర్పాట్లు కూడా చూడాలి
- కాలనీవాసులంతా సేద తీరేలా వాతావరణం కల్పించేందుకు అధికారులు చూడాలి
- పార్కు పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- పార్కులో మద్యం సేవించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.


వాకింగ్‌ ట్రాక్‌లో తాగి పడేసిన మద్యం సీసాలు

రోగులకు పండ్లు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెల్లాపూర్‌ మున్సిపల్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్‌ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణ మైనార్టీ నాయకులు షేక్‌ అబ్దుల్‌ ఖదీర్‌ ఆధ్వర్యంలో కేకులు కట్‌ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌ పార్టీ నాయకులు షేక్‌ అబ్దుల్‌ ఘనీ, నాయకులు అరుణ్‌ గౌడ్‌, వాజీద్‌ పాల్గొన్నారు.

పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

పటాన్‌చెరుటౌన్‌: రాష్ట్రంలోని గ్రామాలను పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని జిల్లా పొగాకు నియంత్రణాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని బీరంగూడ కమాన్‌ వద్ద శుక్రవారం పొగాకు వినియోగం– దుష్ప్రభావాలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌ రెడ్డి మాట్లాడుతూ...నేటి యువత పొగాకును విచ్చలవిడిగా వాడుతున్నారన్నారు. పొగాకు వినియోగం వల్ల చిన్న వయసులోనే వివిధ రకాల కేన్సర్‌, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతగా యువతను పొగాకు వినియోగానికి దూరంగా ఉంచేలా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



చందానగర్‌: వేమన కాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌ రెడ్డి పేర్కొన్నారు.
- కేఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కేఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌ రోడ్డు నెంబర్‌ 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, అపర్ణ ఎన్‌క్లేవ్‌ రోడ్డు, ఇన్ఫినిటీ స్కూల్‌, లగ్జరీ హైట్స్‌ అపార్ట్‌మెంట్స్‌ ఏరియాలలో విద్యుత్‌ ఉండదన్నారు.

హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో..
మాతృశ్రీనగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.
- మాతృశ్రీనగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాతృశ్రీనగర్‌ కొంత భాగం, డీఏవీ స్కూల్‌ దగ్గర, బోర్‌ పార్క్‌ ఏరియా, కేబుల్‌ పార్క్‌ ఏరియాలలో విద్యుత్‌ నిలిపివేస్తామన్నారు.
- మాధవనగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాతృశ్రీనగర్‌ కొంత భాగం, ఎస్‌బిఐ ఏరియా, ఓల్డ్‌ సొసైటీ ఏరియా, మాధవనగర్‌ కొంత భాగం ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు.

గచ్చిబౌలి సబ్‌స్టేషన్‌ పరిధిలో..
గచ్చిబౌలి: గచ్చిబౌలి సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ భాస్కర్‌ తెలిపారు.
- ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు టీఎన్‌జీఓ కాలనీ, జయబేరి ఎన్‌క్లేవ్‌, ఏపీహెచ్‌బీ కాలనీ, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నానక్‌రాం గూడ, జర్నలిస్ట్‌ కాలనీలో విద్యుత్‌ ఉండదన్నారు.
- మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు టీఎన్‌జీఓ కాలనీ, సాయి ఐశ్వర్య, ఖాజాగూడ, మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు ప్రశాంతి హిల్స్‌, పద్మశ్రీ గార్డెన్‌, గౌలిదొడ్డి తదితర ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలివేస్తామని ఆయన వివరించారు.

రూ. 2 కోట్లతో సూర్య భగవాన్‌ ఆలయం

- ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- త్వరలో అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌


సాకి చెరువు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని ఉత్తర భారతీయుల సంక్షేమానికి, వారి ఆర్థికాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు సాకి చెరువు కట్టపైన రూ.2 కోట్ల సొంత నిధులతో సూర్య భగవాన్‌ దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఉత్తర భారతీయులు సూర్యభగవానుడిని ఆరాధిస్తూ నిర్వహించే ఛట్‌ పూజ ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్‌ నీలి కుమార్‌ యాదవ్‌తో కలసి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాణ్యమైన సేవలకు చిరునామా ఏరియా ఆసుపత్రి
ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరొందిన పటాన్‌చెరు పట్టణంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నాణ్యమైన సేవలకు చిరునామాగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి పేర్కొన్నారు. ఆసుపత్రిని అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించడంతోపాటు, రోగులకు కార్పొరేట్‌ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హాస్పిటల్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇటీవల కేంద్ర ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నాణ్యమైన సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించడం పట్ల ఆసుపత్రి వైద్యులను సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... త్వరలో 1.5 కోట్ల రూపాయలతో అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ నిర్మాణం చేపడతామన్నారు. అవార్డు రావడంలో భాగస్వామ్యులైన ప్రతీ ఒక్కరిని సన్మానించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో 24 గంటలపాటు వైద్య సేవలు అందించడంతోపాటు, అన్ని రకాల ల్యాబ్‌ టెస్టులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

మెట్రో కూత కూసేనా..!

పారిశ్రామికవాడకు పెరుగుతున్న డిమాండ్‌

మెట్రోరైలు రాకతో తప్పనున్న ట్రాఫిక్‌ కష్టాలు


జాతీయరహదారిపై భూసార పరీక్ష చేస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న మెట్రో రైలు కల త్వరలో సాకారం కానుంది. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మియాపూర్‌ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు సేవలు పొడిగిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఈ ఏడాది మార్చిలో మెట్రోరైలు వంతెన కోసం జాతీయరహదారిపై భూసార పరీక్షలు సైతం నిర్వహించారు. ఎంపీ రఘునందన్‌ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి వేర్వేరుగా అనేక మార్లు ఈ సమస్యను ప్రభుత్వం, రైల్వే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి ప్రక్రియ వేగవంతానికి కృషి చేశారు. ఈ క్రమంలో మియాపూర్‌ నుంచి రామచంద్రాపురం మీదుగా పటాన్‌చెరు వరకు జాతీయరహదారిపై 13.4 కిలోమీటర్లు మెట్రోరైలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం నుంచి వేలాది మంది హైదరాబాద్‌ పరిసర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు నిత్యం ట్రాఫిక్‌ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. దాంతో ఇక్కడి ప్రజలు మెట్రోరైలు కోసం అనేక ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్నారు.

కారిడార్‌ 7లో..
రెండోదశ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కారిడార్‌ 7లో ముంబై జాతీయరహదారిపై మెట్రోరైలు పనులను చేపడుతున్నారు. మియాపూర్‌ మెట్రోరైలు స్టేషన్‌ నుంచి ఆల్విన్‌ క్రాస్‌రోడ్డు, మదీనాగూడ, చందానగర్‌, బీహెచ్‌ఈఎల్‌ చౌరస్తా, రామచంద్రాపురం మీదుగా పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్లు మెట్రోరైలు లైన్‌ వేస్తున్నారు, ఈ మార్గంలో సుమారు 10 స్టేషన్‌లతో ఉండే పూర్తి ఎలివేటెడ్‌ కారిడార్‌ నిర్మిస్తున్నట్లు తెలుస్తుంది.

అలంకారప్రాయంగా ఎంఎంటీఎస్‌
లింగంపల్లి నుంచి రామచంద్రాపురం వరకు గతంలో ఎంఎంటీఎస్‌ రైలును పొడిగించినప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. రామచంద్రాపురంలో ఎంఎంటీఎస్‌ రైల్వేస్టేషన్‌ ఉన్నప్పటికి ఆ రైలు సరీ్వసులు లేకపోవడంతో స్థానికులు లింగంపల్లికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

మెట్రోకు మరింత డిమాండ్‌
ఈ ప్రాంతానికి మెట్రో రైలు రావడంతో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రజలు సకాలంలో గమ్యానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రాంతానికి చెందిన వందలాది మంది మియాపూర్‌కు వెళ్లి మెట్రోరైలును ఆశ్రయిస్తున్నారు. దాంతో ఈ ప్రాంతంలో మెట్రోకు డిమాండ్‌ పెరగడంతో పాటు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

230 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత

గచ్చిబౌలి: ఎల్‌బీనగర్‌ నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 230 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ... రేషన్‌ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం అందడంతో శుక్రవారం మధ్యాహ్నం గచ్చిబౌలి పోలీసులు, మాదాపూర్‌ ఎస్‌ఓటీ పోలీసులు ఓఆర్‌ఆర్‌పై వెళ్తున్న లారీపై దాడి చేశారు. కోకాపేట్‌ మూవీ టవర్స్‌ సమీపంలో ఓఆర్‌ఆర్‌పై లారీని స్వాధీనం చేసుకున్నారు. 230 క్వింటాల బియ్యాన్ని సివిల్‌ సప్లై అధికారులకు అప్పగిస్తామని ఎస్‌ఐ సాయినాథ్‌ తెలిపారు.

ఫైర్‌ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన


ఫైర్‌ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డోయన్స్‌ కాలనీ విద్యాంజలి హైస్కూల్‌లో ఫైర్‌ సేఫ్టీపై మాక్‌ డ్రిల్‌ శుక్రవారం నిర్వహించారు. ఫైర్‌ సెక్యూరిటీ విభాగం ఇంచార్జీ నీలేష్‌ గోఖే ఎన్ని రకాల మంటలు తలెత్తుతాయో, ఆ మంటలు వచ్చినప్పుడు సమయస్ఫూర్తితో వాటిని ఎలా అదుపులోకి తీసుకరావాలో విద్యార్థులకు మాక్‌ డ్రిల్‌ ద్వారా వివరించారు. మాక్‌ డ్రిల్‌లో విద్యార్థులను కూడా భాగస్వాములను చేసి ఏ విధంగా స్పందించాలో తెలియజేశారు. స్కూల్‌ ప్రిన్సిపాల్‌ బాలాత్రిపురసుందరి ఫైర్‌ సిబ్బందిని అభినందించారు.

11 మంది హిజ్రాల బైండోవర్‌

గచ్చిబౌలి: రాత్రి వేళల్లో రోడ్లపై హిజ్రాలు నిలబడి అటుగా వెళ్లే ప్రయాణికులను ఆకర్షిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో సైబరాబాద్‌ యాంటి హ్యూమన్‌ ట్రాకింగ్‌ యూనిట్‌ పోలీసులు పలు చోట్ల దాడులు చేశారు. గురువారం రాత్రి ఇన్‌స్పెక్టర్‌ జేమ్స్‌ బాబు ఆధ్వర్యంలో ఔకియా కూడలిలో తొమ్మిది మంది, కైత్లాపూర్‌లో ఇద్దరు హిజ్రాలను అదుపులోకి తీసుకొని మాదాపూర్‌, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. 11 మంది హిజ్రాలను ఆయా తహసీల్దార్ల ఎదుట బైండోవర్‌ చేశారు. హిజ్రాలు ప్రయాణికులను ఆకర్షించినా, డబ్బులు వసూలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిరంతరం దాడులు చేస్తామని ఇన్‌స్పెక్టర్‌ జేమ్స్‌ బాబు హెచ్చరించారు.

తప్పుడు కేసులకు భయపడేది లేదు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న తనపై సొంత గ్రామానికి చెందిన రాజకీయ నాయకులు కక్షపూరితంగా కేసులు పెట్టారని ఆర్కే ఫౌండేషన్‌ చైర్మన్‌ రమాకాంత్‌ అన్నారు. శుక్రవారం ఆయన ఈ సందర్భంగా ఆయన కాజిపల్లిలో మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి కోసం స్వచ్ఛందంగా శ్రమిస్తున్న తనపై కొందరు రాజకీయ నాయకులు పనిగట్టుకొని మరి దుండిగల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కాజిపల్లి సమీపంలోని జీఎంఆర్‌ కాలనీలో స్వచ్ఛందంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకాలు కల్పించే చర్యల్లో భాగంగా తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. అయినా ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు.

సమగ్ర సర్వే పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర సర్వే ప్రక్రియను మండల ప్రత్యేక అధికారి అఖిలేష్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి స్టిక్కరింగ్‌ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నేటి నుంచి ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు గ్రామస్తులు సహకరించి 75 అంశాలకు సంబంధించిన వివరాలను అందించాలని కోరారు. ఎన్యూమరేటర్లు ఉదయం 8 గంటల లోపే సర్వే ప్రక్రియలో పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి, ఎన్యూమరేటర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని మారు మూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు మాజీ ఎంపీపీ రవీందర్‌ గౌడ్‌ అన్నారు. శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును వావిలాల జిన్నారం గ్రామస్తుల సమక్షంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ... జీడిమెట్ల డిపో అధికారులతో చర్చించి మండలంలో నూతనంగా మూడు బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు సర్వీసు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళల్లో మూడు ట్రిప్పులు సికింద్రాబాద్‌ జిన్నారం శివానగర్‌ రూట్లలో ప్రయాణిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ మాజీ వార్డు సభ్యులు యువజన కాంగ్రెస్‌ నాయకులు గ్రామస్తులు ప్రయాణికులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి కేక్‌ కట్‌ చేశారు. యూత్‌ కాంగ్రెస్‌ ప్రొటోకాల్‌ చైర్మన్‌ ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ సమీపంలో వృద్ధాశ్రమంలో కాంగ్రెస్‌ నేత నాగరాజు ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌ పాల్గొన్నారు. ● సర్వేను పరిశీలించిన డీపీఓ సంగారెడ్డి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సాయిబాబా శుక్రవారం పరిశీలించారు. చౌటకూర్‌ మండలంలోని కోర్పోల్‌ గ్రామంలో సర్వే వివరాలు అయన అడిగి తెలుసుకున్నారు. ఎంపీఓ శ్రీకాంత్‌ ఉన్నారు.

పనుల పరిశీలన

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌ కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు 3వ ఫేజ్‌లోని ధోబీఘాట్‌ వద్ద నిర్మాణంలో ఉన్న ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

CORRIGENDUM NOTICE

The General Public are hereby inform that my clients (1) Sumit Panjabi S/o. Arun Prakash Panjabi and (2) Nupur Panjabi, W/o. Sumit Panjabi both are R/o. Gachibowli, Hyderabad got published the Public Notice in Sakshi Telugu Daily on 12-07-2024 intimating about the lost of Sale Deed No.4190/2018 pertains to Flat No.1701, 17 th Floor of Tower II of My Home Vihanga, Gopanpally, R.R. District and in which Block Number was wrongly mentioned as Block No.2 instead of Block No.4 due to typographical error. Hence my clients are hereby informing to the General Public to treat the Block No.4 in the place of Block No.2 as got published in the above News Paper Dated 12-07-2024. Hence this Corrigendum Notice.

M.Srinivas Reddy, Advocate,
Office at Plot No.37 E/P, Visvesvaraya Engineers Society, Hastinapuram, B.N.Reddy Nagar R.R.District
(Ph.No.98481 59089)